# ప్రేమాయణంలో పిడకలవేట

పాఠకలోకానికి నమస్సులు.

ఈ సీరియల్ మీరు చదివే ముందుగా,
మీతో ఓ విషయం ప్రస్తావించాలను కుంటున్నాను. ఫోటో సీరియల్ అనేది ఓ అద్భుతమయిన ప్రక్రియ. ఈ ప్రక్రియని ఇంగ్లీషు, హిందీ, కన్నడ మొదలయిన అనేక భాషల పత్రికలు విజయవంతంగా నిర్వహించాయి. వీటిలో కొన్ని సీరియల్స్ సంచలనాన్ని కూడా సృష్టించాయి.

ఈ ప్రక్రియని, మయూరి కోసం వేయాలన్న ఓ ఆలోచన నా మనస్సులోకి వచ్చింది. ఆ తలపు వచ్చినదే తడవు, 'మయూరి' ఆఫీసుకి వెళ్ళి శ్రీ కిషోర్‌ని కలిశాను. ఆయనతో నా అభిప్రాయం చెప్పాను. అది విని ఒకింత ఆలోచించి, నాతో అన్నారు—"ఫోటోగ్రాఫర్‌గా మీ టాలెంట్, స్కిల్ నాకు తెలుసు. అందమైన ఫోటోలు ఇస్తారు. కానీ మీ ఫోటోలకి ప్రాణంపోసే ఓ మంచి కథ కూడా కావాలికదా! మంచికథ ఉంటే చెప్పండి, వెంటనే ఫోటో సీరియల్ వేద్దాం" అన్నారు సో... గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది.

కథ గురించి ఆలోచనలో పడ్డాను... రకరకాల కథలు నా మస్తిష్కంలోకి వచ్చాయి. కానీ ఏదీ ఓ పూర్తి రూపం దాల్చలేదు. (కారణం నేను కథారచయితని కాదుగా!) రెండురోజులు గడిచాయి. అదే సమయంలో నా మిత్రుడు (మీ అందరికీ సుపరిచితుడు) ప్రముఖ యువరచయిత, వేంపల్లి నిరంజన్‌రెడ్డి గుర్తువచ్చాడు. అదేరోజు అతనిని కాంటాక్ట్‌చేసి "ఓ మంచి కథ కావాలి, అందుకు నీ సహాయం కావాలి" అన్నాను. అడిగిందే తడవు ఓ చక్కని ప్రేమకథ చెప్పాడు. ఆ కథ నాకెంతో నచ్చింది. ఇద్దరం కలిసి దానికి కొన్ని మార్పులు, చేర్పులు చేసాము. ఆ కథని 'మయూరి'కి వినిపించాము. కథ నచ్చింది. అంతేకాదు కొన్ని అందమైన మెరుగులు కూడా దిద్దారు. సో... కథ రెడీ. ఎడిటర్ అండ్ పబ్లిషర్ శ్రీ భీమ్‌రెడ్డి గారి నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ వచ్చింది!

వెంటనే ఆ కథకి, షాట్ డివిషన్ వగైరాలు అన్నీ తయారయిపోయాయి. ఆర్టిస్టులని కూడా సెలక్ట్‌చేసాము. లొకేషన్స్ కూడా డిసైడ్ అయిపోయాయి. ఈ కథకి ఫోటోగ్రఫీతోపాటు దర్శకత్వ బాధ్యత కూడా నేనే చెపట్టాను. ఐదున్నర రోజుల పాట ఏకబిగిన షూట్‌చేసాము. ఫిల్మ్‌లు ప్రాసెస్ అయ్యాయి. రిజల్ట్స్ మాకందరికీ సంతృప్తి నిచ్చాయి.

అందరి శ్రమఫలితమే ఈ 'ప్రేమాయణంలో పిడకలవేట'. మా ఈ శ్రమ, విజయవంతమవుతుందన్న నమ్మకం, ఈ సీరియల్ నిర్మాణానికి పూర్తి బాధ్యత వహించిన నాకు ఉంది. నా శ్రమ విజయవంతమయిందా, లేదా అని తేల్చవలసిన న్యాయనిర్ణేతలు మీరు.

కృతజ్ఞతలతో



— వై.ఎస్.ఎన్.మూర్తి.

కథ: వేంపల్లి నిరంజన్‌రెడ్డి ● ఫోటోగ్రఫీ దర్శకత్వం : వై.ఎస్.ఎన్.మూర్తి






ఈయనే ఐ.పి.జంబులింగం. ఓ పెద్ద కంపెనీకి బాస్. భారీకాయుడు, ఖండశాసనుడు. వయస్సు నలభైమూడు. అయినా బ్రహ్మచారి. జీవితంలో ఎంతోమందికి ప్రేమలేఖలు రాశాడు, ప్రేమించాడు. కానీ ఈయనని ఎవరూ ప్రేమించలేదు. అదే ట్రాజెడీ. అందుకే తను ప్రేమించడం మానేసి, అందరికీ ప్రేమసలహాలు ఇచ్చి మెదడు తింటూ ఉంటాడు. ఒక్క ప్రేమజంటనైనా తయారుచెయ్యాలన్నది ఈయన చిరకాల వాంఛ.



ఇతని పేరు అబ్బారావు. జంబులింగం దగ్గర అసిస్టెంట్. జంబులింగం ఎంత 'దుక్క'లా ఉంటాడో, ఇతను అంత 'బక్క'గా ఉంటాడు. చూపులకి 'దొంగకోళ్ళ' వాటంలా ఉంటాడు. పైకి కనపడదు కానీ అమోఘమైన తెలివితేటలున్నాయి ఇతనికి. ముందు ముందు మీకే తెలుస్తుంది.



ఇతని పేరు మబ్బు కుమార్. పేరే కాదు మనిషికి కూడా వింతైనవాడు. జంబులింగం ఆఫీసులో పనిచేసే గుమాస్తా ఇతను. మూఢనమ్మకాలంటే పడిఛస్తాడు. ఈ కథ మొదలయ్యేనాటికి అతను ముఖం కడుక్కొని, స్నానం చేసి, రెండు సంవత్సరాలయింది. ఇతని స్నానం వెనుక ఓ ''భయంకరమైన'' ఫ్లాష్‌బ్యాక్ ఉంది.



వీరు స్వామి శునకానందులవారు. సన్యాసం స్వీకరించినా, గ్లామర్ తగ్గకూడదన్న బలమైన అభిప్రాయం ఉన్నమనిషి. అందుకే ఖరీదైన కూలింగ్ గ్లాసెస్ పెట్టి మరీ తిరుగుతుంటాడు. కనిపించిన ప్రతివాడికీ జోస్యం చెప్పేస్తుంటాడు. వద్దన్నా సరే!



మండోదరి మామ్మ: ఓ పాతకాలం పెంకుటింటికి ఓనరు. ఆవులించకుండానే, పేగులు, ఎముకలు కూడా లెక్కపెట్టేయగలదు. హేమాహేమీలే ఈవిడ తెలివితేటల ముందు బోల్తాపడ్డారు.



ఇతను రాంబాబు. పాతికేళ్ళ కుర్రవాడు. ఆరడుగుల అందగాడే కానీ, అమ్మాయిలతో మాట్లాడాలంటే సిగ్గుతో ముడుచుకుపోతాడు. భయంతో బిక్కచచ్చిపోతాడు. తన ఊహల్లో ఓ ఊహాసుందరిని సృష్టించుకున్నాడు. 'లౌ'చెయ్యాలి అన్న తపనే కాని 'లౌక్యం' తెలియని భోళా మనిషి.



ఈమె రమ్య. లక్షల ఆస్తికి వారసురాలు. అయినప్పటికీ— మనుషులు, మమకారాలకే ఎక్కువ విలువ ఇచ్చే మనస్తత్వం ఈమెది. ఫ్యాషన్లంటే ఈమెకు పంచప్రాణాలు.



కొంచెం సన్నగా నాజూకుగా ఉండే ఇతని పేరు రవి. బి,కాం., చదివాడు. వాకులాంటి కుర్రాడు. కావాలంటే ఇతనితో కూరలు కోసుకోవచ్చు. విటికలో విషయాన్ని గ్రహించేయగలడు.



శంకరాభరణం సినిమాలోని రాజ్యలక్ష్మి టైపులో ఉండే ఈమె పేరు సీత. వయస్సు పద్దెనిమిదేళ్ళు. స్వచ్ఛమైన తెలుగింటి ఆడపడుచు. సున్నిత మనస్కురాలు.



ఇతను సీత తండ్రి పరంధామయ్య. రైల్వేలో గుమాస్తాగా వేసి రిటైరయ్యాడు. కోపం ముక్కుమీదే ఉంటుంది. ఆ కోపం వచ్చిందంటే ముందు వెనుకలాలోచించకుండా ఫడామడా ఎవరినైనా తిట్టేయగలడు.



వీడు శీనుగాడు. సీత తమ్ముడు. సీత ఎంత విదానస్తురాలో, వీడు అంతదుడుకు. గంట టైములో హైదరాబాద్ మొత్తాన్నే అమ్మేయగల మహాముదురు.



ఇలాంటి పాత్రల మధ్య జరిగిన ఓ గమ్మత్తైన కథే, ఈ 'ప్రేమాయణంలో పిడకలవేట'.

**ఇక వచ్చేవారం కథలోకి పరిగెడదామా!**

